కథ

# అమ్మమ్మ

ముకుంద రామారావు



**కుం**డపోతగా బయటవాన కురుస్తోంది. పిల్లలందరితో పార్కుకి వెళ్లాలన్న ఆలోచన మానుకోక తప్పలేదు. "మీకు వేడివేడిగా కంకులు కాల్చి ఇస్తానర్రా. మాంచి లేతవి తీసుకొచ్చారు మీ తాతయ్య" పిల్లల్ని ఉత్సాహపర్చింది వాళ్ల అమ్మమ్మ.

శలవుల్లో అమ్మమ్మ దగ్గరకే వెల్తామని పట్టుపట్టి మరీ వస్తారు పిల్లలు ప్రతీసారి. వాళ్ల అమ్మగాని, నాన్న గాని పిల్లల్ని దించి వెళ్లటమో, తీసుకుపోటానికి రావటమో, ఈ పిల్లల మూలంగా కావటం మాకు ఆనందంగా ఉంటుంది. మళ్లీ పిల్లల శలవులు ఎప్పుడొస్తా యోనని, వారి శలవులు అయిపోయిన దగ్గర్నుంచీ ఎదురు చూస్తూనే ఉంటాం.

వాళ్ల అమ్మమ్మ కాల్చిన కంకులు నాకు కూడా తీసుకొచ్చి నా చుట్టూ చేరారు పిల్లలు.

"బాగున్నాయి తాతయ్యా ఈ కంకులు. అమ్మ తెచ్చేవెపుడూ ఎంత గట్టిగా ఉంటాయో. నమలలేక చస్తాం" మాటల్లోకి దించే ప్రయత్నమనుకుంటాను వారిది.

ఆ మాట ఈమాట మాట్లాడి మా పెద్ద మనుమరాలు అడిగింది. "మీరు కూడా మాలానే శలవులకు మీ అమ్మమ్మ దగ్గరకి వెళ్లేవారా?" అని.

"అవును తాతయ్యా చెప్పండి చెప్పండి" మిగతా పిల్లలూ గొడవ చేయటం మొద లెట్టారు.

కాస్సేపు నేనేమీ మాటాడక పోయేసరికి వాళ్లు, "చెప్పండి తాతయ్యా" అని మరీ గారాం పోయారు.

నిజానికి నాకు కాస్సేపు ఏమి చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియ లేదు.

"మా తాతయ్యని మేము చూడలేదు. మా అమ్మ చూసిందో లేదో తెలీదు. తన చిన్నప్పుడే వాళ్ల నాన్న పోయారని చెప్పినట్టు జ్ఞాపకం. ఇద్దరన్నలు తరువాత మరో పాపని పెంచుకున్నాక పుట్టిన ఆఖరి సంతానం మా అమ్మ. వాళ్లింట్లో ఎవరికీ చదువులు లేవు. పుట్టిన అయిదేళ్లకే పెళ్లిచేసారు. అన్ని చాకిరీలు చేసుకుంటూ, పదేళ్ల నుండి అత్తారింటిలో ఉంది. ఇంట్లో పెద్దకోడలు. ఇద్దరు మరుదులు. ముగ్గురు ఆడపడుచులు. పొద్దున్న నాలుగింటికి లేస్తే రాత్రి ఏ పద కొండింటికో నిద్ర పోవటం. అదేదో పని పిల్లలా అందరి అజమాయిషీ" నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి.



అందరూ ఎంతో శ్రద్ధతో వింటున్నారు. ''అమ్మో, మీ అమ్మకి అన్ని కష్టాలా? పాపం ఎంత బాధ పడిందో!'' వాళ్లూ బాధపడిపోయారు.

''అయ్యో, ఇదేంటి ఏదో చెప్పబోయి, ఇంకేదో చెప్తున్నాను'' అని మళ్లీ మొదలెట్ట బోతుంటే...

''లేదు తాతయ్యా నువ్వు చెప్పేది మాకు వినాలని ఉంది. ఏవో పాత సినిమాల్లో కథలా ఉంది. ఆపేసిన దగ్గర్నుంచే మొదలెట్టండి'' అన్నారు పిల్లలు.

''మా అమ్మకి బాల్యం లేదు. గారాబమూ లేదు. తల్లిదండ్రుల ప్రేమా లేదు. అత్తారింట్లో ఒక బానిస బతుకు''.

నన్ను బాధపెట్టకూడదనో ఏమో, ''పోనీలే తాతయ్యా ఇది వదిలేసి మీ అమ్మమ్మ వాళ్లింటికి వెళ్లేవారా లేదా చెప్పండి'' నన్ను మళ్లించే ప్రయత్నం చేసారు.

తెలీదు గానీ, పిల్లలు ఎంత గమనిస్తారో మన లోపలి దుఃఖాన్ని.

గుండె బరువయి అమ్మ విషయం జోలికి, నాకూ ఇంక పోబుద్ధి కాలేదు.

''మహాఅయితే నాకు గుర్తున్నంత వరకూ, ఒక నాలుగైదుమార్లు వెళ్లామేమో, మా అమ్మమ్మ ఇంటికి. అదీ ఆ దగ్గర్లో ఎవరివో పెళ్లిళ్ల కోసమో, మా నాన్న ఆఫీసు పనుల కోసమో వెళ్లినప్పుడు మాత్రమే. అమ్మమ్మ దగ్గరే ఉండాలని ఎప్పుడూ వెళ్లలేదు. అలా అని అమ్మమ్మ అంటే ఇష్టం లేక కాదు''.

''మా నాన్నకు మా అమ్మని అక్కడకి పంపటం ఇష్టముండేదికాదు. మా అమ్మ అత్తారింటిలోనే పెరగటాన్ని, వాళ్లమ్మను చూడాలన్న తపన అంతగా ఉన్నట్టు నాకు గుర్తు లేదు. ఎవరితోనో రాయించిన ఉత్తరాలు, మా మావయ్యల దగ్గర్నుంచి చాలా అరుదుగా వచ్చేవి. వాటికి జవాబు మా నాన్న రాసేవారే లేదో తెలీదు. అంచేత అమ్మమ్మవి ఏవో కొన్ని జ్ఞాపకాలు మాత్రం ఉన్నాయి. అవే చెప్తాను కావాలంటే'' అన్నాను.

''సరే తాతయ్యా అవైనా చెప్పండన్నారు'' పిల్లలు.

''మా మావయ్యలకు తెలియకుండా, నా కిష్టమని పెసరట్టు కొని తెచ్చి, నన్ను కొట్టు గదిలో దాచి తినమనేది మా అమ్మమ్మ. నాకు మొదట్లో తెలిసేది కాదు, ఎందుకలా చేస్తుందోనని. మా మావయ్యలు కూతురుకు దాచి పెడ్తుందని తిడతారట, మేము లేనప్పుడు. అలా అని చుట్టుపక్కల వాళ్లు చెప్పేవారు''.

''మీ మావయ్యలు చాలా చెడ్డవాళ్లు తాతయ్యా'' పిల్లలంతా ఒకేసారి అన్నారు.

''మా అమ్మమ్మ ఏవో పాటలు పాడేది. భలే నవ్వొచ్చేది మాకు, తన హావభావాలు చూసి నవ్వుతున్నారేమర్రా, నేను మీలాగ చదువుకున్న దాన్నికాదు అని బాధపడిపోయేది. సారీ అమ్మమ్మా. బాగా పాడుతున్నావంటే, అంతలోనే సంతోష పడిపోయేది''.

''ఒక్కోసారి మమ్మల్ని మా మావయ్య పొలాల దగ్గరకు తీసుకుపోయేది. దగ్గర్లో కొండలు, కొండ మీద గుడులు చూపించేది. ఆ కొండల మీంచి అటూ ఇటూ చూపించి తనకు తెలిసిన విషయాలు, జ్ఞాపకాలు, కథల్లా చెప్పేది. అవేవీ గుర్తులేవు నాకిప్పుడు. కొన్ని అర్థం అయ్యేవి కావు. అర్థం చేసుకోవాలన్న ప్రయత్నమూ చేసింది లేదు. కొండల మీద చెట్లెక్కి, పూలు పళ్లు కోసినా, కొమ్మలు విరిచినా కోప్పడేది. మేము మరీ వినకపోతే మీ నాన్నతో చెప్తానని బెదిరించేది''.

''ఒక రోజు, పొలంలో పెదమావయ్యే ఒరే అబ్బాయి ఈ మజ్జిగ తాగురా అని ఒక గ్లాసు తెచ్చిచ్చాడు. అది చూస్తే కంపు కొడ్తోంది. నేను తాగకుండా అమ్మమ్మ వేపుచూస్తే, అమ్మమ్మ నవ్వింది. అది మజ్జిగ కాదురా కల్లు అని''.

''కాస్త తాగి చూడకపోయారా తాతయ్యా'' అన్నాడు మనవడు. పిల్లలంతా నవ్వారు. ''ఛీ ఛీ కల్లు సారా లాంటిదిరా, తాగకపోవటమే మంచిపని చేసారండి'' మా పెద మనవరాలు.

''ఏమోరా. గుర్తొచ్చినవళ్లా చెప్తున్నాను'' అన్నాను. అయినా వదలలేదు పిల్లలు. మీకు గుర్తున్నవే చెప్పండని.

''మాతో మా అమ్మమ్మ అష్టాచెమ్మా ఆడేది. అష్టా అంటే అష్టా, చెమ్మా అంటే చెమ్మా, ఏది కావాలంటే అది వేయగలిగేది. చేతిలో ఏదో మాయ ఉన్నట్లు. పులీ మేకా ఆటలు కూడా బాగా ఆడేది''.

''నేను మరచిపోలేని ఆట సంగతొకటి చెబుతాను'' అనేసరికి పిల్లలు మరింత సరదా పడిపోయారు.

''ఆడుకునే పిస్తోళ్లు తెచ్చుకున్నాం మాతోబాటు ఇంటి నుండి అవి పేలుస్తే చచ్చి పోయినట్టు నటించాలి''.

''అవును, అది మేము కూడా ఆడుకుంటాం కదా'' అన్నారు పిల్లలు.

''అవును అదే. మా అమ్మమ్మ చనిపోయినట్టు నటించలేకపోయేది. నవ్వేసేది. లేదా పోండర్రా అని విసుక్కునేది. కానీ ఒకరోజు, అవేవీ లేకుండా చనిపోయినట్టు నటించింది. మేమంతా కేరింతలు కొట్టాం. అమ్మమ్మకి కూడా ఆట వచ్చేసిందని చప్పట్లు కొట్టాం. కాస్సేపయాక అమ్మమ్మ లేవాలి కదా, లేవలేదు. ఇంకా నటిస్తూ ఉందను కున్నాం. అమ్మమ్మా అమ్మమ్మా అని అరిచాం. పలక లేదు. ఒళ్లు కుదిపాం. కదల లేదు. అరిచాం చలనం లేదు. మాకు భయమేసింది. ఏడ్చాం. చుట్టుపక్కల ఎవరూలేరు. పొరుగూరులో పెళ్లి కెళ్లారు. ఏమిచేయాలో తెలియక వణికిపోయాం. అంతలోనే అమ్మ మ్మతో హాస్యాలాడే పక్కింటి ఆంటీ వచ్చింది. మా బాధ చూసి దగ్గరకొచ్చి, నాడి చూసి, ముక్కుదగ్గర వేలుపెట్టి చూసి, నెమ్మదిగా అమ్మమ్మ కొంగుకున్న మూటని విప్ప బోయింది. ఎవర్రా అది, నా డబ్బు నా డబ్బు, అంటూ లేచి కూర్చుంది అమ్మమ్మ''.

''హమ్మయ్యా అనుకున్నాం. కానీ ఆ మూటలో ఏముంది, అంత కలవరపడిపోయింది అమ్మమ్మ, అని తెలుసుకుంటే, అదీ అప్పుడప్పుడు, మా మావయ్యలు ఇచ్చే పదీ పరకా, మేమొస్తామని దాచుకున్న చిల్లర డబ్బులు''.

''అమ్మమ్మని చూస్తే జాలేసేది మావయ్యల్ని చూస్తే కోపమూ వచ్చేది. మీకంత ప్రేముంటే మీరే మీ దగ్గరకి మీ అమ్మమ్మని తీసుకుపోండి అనేవాళ్లు. అది మా అమ్మకు చాతనయిన పనీ కాదు నాన్నకు చెప్పేటంత ధైర్యమూ లేదు. నాన్నకు మేమైనా చెప్పి ఒప్పించే వయస్సూ కాదు మాది. అయితే నేను కూడా ఏదో చేయగలిగానన్న సంతృప్తి నాకు ఒక్కమారే వచ్చింది. అమ్మమ్మ అవసానదశలో అదే ఊరు ఏదో పనిమీద నేను వెళ్లాను. కొన్నిరోజులైనా బతుకుతుందో లేదోనని, మా అమ్మని వెంటనే రప్పించ గలిగాను. మా అమ్మ వచ్చిన మూడో రోజే అమ్మమ్మ పోయింది. వాళ్లమ్మ ఆఖరి ఘడియల్లో చూసుకునే అదృష్టం కలగచేసినందుకు మా అమ్మ జీవితాంతం నన్ను మెచ్చుకునేది''.

''అదర్రా, చెప్పటానికేముంది, ఇలాంటివే ఏవో కొన్ని'' అంటుంటే ''సారీ తాతయ్యా మీ అమ్మని అమ్మమ్మని గుర్తు చేసి మేము మిమ్మల్ని బాధ పెట్టామేమో, ఇంకెప్పుడూ అడగములే'' అని ఒక్కొక్కరూ జారుకున్నారు.

బయట వర్షం ఆగకుండా కురుస్తూనే ఉంది. నాలోను కూడా.

*

*రచయిత సెల్ నెం: **99083 47273***